# అమ్మతల్లి గుడి

**-రావి-ఎన్-అవధాని**

"అప్పల్నూరీ! నాకు తెలవక అడగతన్నాను! ఇదేమో మరి ఎలచ్చన్లసీజను గాదాయె! జల్మబూవి టయాం అసలే గాదు! ఈ బోర్ల బాగోతవేటం టావ్!''

"అదే సూరయ్యా మావా! పెందిలి కాడ నుంచీ నానూ పాలుపోక యిసయం ఏటాని నుంజుకుంటున్నాను!''

"మా గేమంల బోరు ఏపించండి! ఆడోల్లు తాగునీటి కోసం దూరాబారం ఎల్తన్నరు! అని సర్కారు వోరికి ఇన్నపాలు అర్జీలు ఎట్టుకుని ఎదురు సూసినాం! పెయోజనం లేదాయె! మూడు ఎలచ్చన్లు సూసినావు! ఊర్ల బోరు దిగనేదు''

"మరి యీ పొద్దు ఏకబిగిని ఊర్ల మూడు బోర్లు దిగ్గొడతన్నారు సిత్రంగా నేదూ?''

"మన పెసిడెంటుగోరు యిది ఆరి నిర్వోకవేనని తెగ మురిసిపోతన్నారు. దీని ఇసయం యిదని ఎవురుకీ ఆరు ఇంతొరకూ సెప్పనేదు. అడిగినోల్లని తుల్లకసరతన్నాడు. బోర్ల పనయేవొరకూ అటికేసి ఎవురూ ఎల్లకండని, సొప్పదండు పెస్నలు యేసి ఇసిగించకండని ఆర్డరు ఏసినాడు! ఇన్నావు గదేటి?''

"ఒగ్గిరా మనకి మన పెసిడెంటుగోరి వయినం తెల్దేటి? ఆరికి బోదవుతే గదా మనకి బోద సేయిడానికి.''

"అదిగాదు మావా?'' మన సత్తెంబాబు సూడు! ఆరిని ఏది అడుగు పెతీ యిసయం యిడమరిసి అరదమయేటట్టు బోదసేస్తాడు.''

"అవున్రా! అదేగద మరి సదూకున్నోడికీ సదూకోనోడికీ వెత్తేసం! ఆరు టయాంల ఊరెల్లినారు గానీ నేకుంటే యీసరికి ఇదిరా దీన్సంగతని సెప్పేవోరు!'' అన్ని గ్రామాల వలే పోలారం గ్రామ ప్రజలు కూడా త్రాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. గ్రామానికి కిలోమీటరు దూరంలో ఓ రైతు పొలంలో ఉన్న వ్యవసాయ బావి నీరు గ్రామ ప్రజలు తెచ్చుకొని దాహం తీర్చుకుంటున్నారు. అయితే వర్షాకాలంలో పొలాల గట్లంట బురదలో వెళ్లి నీళ్లు తెచ్చుకునేందుకు ఆడవాళ్లు ఎంతో అవస్థలు పడుతున్నారు. త్రాగునీటి కోసం గ్రామంలో బోరు వేయించమని ప్రభుత్వం వారికి ఎన్నో అర్జీలు పెట్టుకున్నారు. అయినా లాభం లేకపోయింది.

గ్రామంలో చదువుకున్నవారు కొద్ది మంది మాత్రమే ఉన్నారు. ఆ కొద్దిమందిలో సత్యం మంచి తెలివితేటలు, చక్కటి ఆలోచన ఉన్న వ్యక్తి. ప్రతీ విషయం నిశితంగా పరిశీలించి దాని మంచి చెడ్డలు నలుగురికీ అర్థమయ్యేటట్లు చెప్పగల ఓర్పు, నేర్పు ఉన్న మనిషి. అయితే అతను ఏ విషయంలోనూ అనవసరంగా తలదూర్చడు. రాజకీయాల జోలికి పోడు. సత్యం వయస్సు 35 సంవత్సరాలు. టెన్త్ వరకూ చదువుకున్నాడు. గ్రామంలో పిత్రార్జితం పది ఎకరాల పొలం ఉంది. వ్యవసాయం చేసుకుంటున్నాడు.

పోలారం గ్రామ వాసులంతా వ్యవసాయదారులు. సన్నకారు చిన్నకారు రైతులు. వారి గ్రామ దేవత పోలేరమ్మ. గ్రామదేవత కరుణ వల్ల ఆ తల్లి చల్లని చూపు వల్ల గ్రామప్రజలు, వారి పిల్లలు, పశువులు, పంటలు ఎటువంటి రోగాలు, చీడపీడలు లేకుండా ఉంటున్నారని వారి నమ్మకం. ప్రతి సంవత్సరం గ్రామదేవత పోలేరమ్మ జాతర గ్రామ ప్రజలంతా ఎంతో వైభవంగా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. పోలేరమ్మను గ్రామప్రజలు "అమ్మతల్లి'' అని సంబోధిస్తారు.

అది వేసవి కాలం అవడం వల్ల గ్రామ ప్రజలకు వ్యవసాయం పనుల ఒత్తిడి లేదు. పనులు లేని సమయంలో రోజూ సాయంత్రం ప్రజలు రచ్చబండ వద్ద చేరి కబుర్లు చెప్పుకోవడం వారికి అలవాటు. ఆరోజు కూడా ప్రజలందరూ చేరి ఊసులాడుకుంటున్న సమయంలో వారి వద్దకు సత్యం వెళ్లాడు. అతని గురించి కబురు పంపితే వెళ్తాడు. వాళ్లకు తెలియని విషయాలు ఏవైనా తనకు తెలిస్తే వారికి చెప్పి వస్తాడు. అయితే ఆ రోజు అందుకు విరుద్ధంగా అతను తనే వారి వద్దకు వెళ్లడంతో అక్కడున్న వారంతా ఆశ్చర్యపడ్డారు.

"అతను ఏదో ముఖ్య విషయం నలుగురికీ చెప్పాలనే ఉద్దేశంతో వచ్చాడు కాబోలు!'' అనుకున్నారు.

"ఏటి సత్తెంబాబుగోరు! ఇలా వొచ్చీసినారు! రండి కూకోండి! మంచి ఊసు ఏటైనా ఉందేటి? సెప్పండి!'' అన్నాడు ప్రెసిడెంట్ పరసునాయుడు ఆప్యాయంగా పలకరించి.

సత్యం కాస్త తటపటాయించేడు.

"అదేటి బాబు తవరు అందరి మంచి గోరేవోరు! పర్లేదు సెప్పండి!'' అన్నాడు గ్రామ పెద్ద పోలినాయుడు.

"మరేటీనేదు! మరో మూడు మాసాల్లో అమ్మతల్లి జాతర సెయ్యాల! పోలేరమ్మ తల్లికి గుడి నేదు. ఎండకు ఎండి వానకు తడిసి గేమానికి ఆవడదూరంలో సింతలతోపుల సెట్టు కిందే ఉంది...''

"అవును బాబూ! ఆడోల్లు మొక్కుబడులు సెయ్యాలన్నా, పసుపు, కుంకం, పండూ కాయ ఎట్టాలన్నా, కొత్త కోక సూపాలన్నా దూరాబారం ఎల్లాల!''

"అందుకే అమ్మతల్లికి గుడి గేమం పొలిమేరల గట్టాల! పోలేరమ్మతల్లి అందరికీ అందు విడిగ గేమం ముందు ఉంటాది. పొలిమేరలో నాకు ఎకరం పొలం ఉంది. అది అమ్మతల్లి గుడి కట్టడానికిస్తున్నా. అందల గుడికడిత...''

"సేనా బావుంటాది సత్తెంబాబూ! ఆడ గుడి కడిత అందరికీ అందువిడిల ఉంటాది. జాతర టయాంల మసలడానికి యీలవుతాది'' అన్నాడు పోలినాయుడు. గ్రామ పెద్ద పోలినాయుడి ప్రపోజల్ ప్రజలందరూ ఏకగ్రీవంగా ఆమోదించేరు.

గుడి కట్టడానికి కావల్సిన సొమ్ము గ్రామ ప్రజలు చందాల రూపంలో సమకూర్చాలనుకున్నారు. చందా సొమ్ము సత్యం వద్ద ఉంచి గుడి కట్టించే పని అతనే చూడాలన్నారు. గ్రామ ప్రజలందరూ పట్టుపట్టి సత్యం ఆ పని చెయ్యడానికి అంగీకరింపజేసేరు. సత్యం కాదనలేకపోయాడు.

ఎవరు ఎంత డబ్బు చందా ఇచ్చారో పుస్తకంలో వివరాలు రాసుకొని రోజూ సాయంత్రం రచ్చబండ వద్ద ప్రజలకు ఆ చందా వివరాలు చెప్పన్నాడు సత్యం. వారం తిరిగే సరికి గ్రామంలో ప్రతీ కుటుంబం వారూ పోటీలు పడి చందాలు ఇచ్చారు. గ్రామ పెద్ద పోలినాయుడు, ప్రెసిడెంటు, ఇతర పెద్దలు ఓ రోజు పంతులుగారిని రప్పించి

"ఊరి పొలిమేరలో అమ్మతల్లికి గుడి కడతన్నాము! గుడి కట్టడానికి మంచి రోజు చూసి చెప్పమని'' అడిగేరు. గ్రామ ప్రజలందరూ చందాలు వేసుకొని ఆ సొమ్ముతో పోలేరమ్మకు గుడి కట్టబో

తున్నారన్న విషయం తెలుసుకొని పంతులు గారు ఆనందించేరు.

"ఇప్పుడు మూఢం వచ్చింది. ముహూర్తం పెట్ట కూడదు. మూఢం వెళ్లగానే నేనే వచ్చి గుడి కట్టడానికి మంచి ముహూర్తం నిర్ణయిస్తాను'' అని చెప్పి వెళ్లిపోయేరు పంతులు గారు.

"తాగునీటి కోసం ఊర్ల బోరు బావి ఏపించమని సర్కారు వోరికి ఎన్నో అర్జీలు ఎట్టుకున్నాం! ఎవురూ మన గోడు పట్టించుకోనేదు! అమ్మతల్లి గుడి కట్టించాలనుకున్నాం! ఆ తల్లి కరుణించింది! ఊర్ల గొట్టం బోర్లు దిగేయి! అమ్మతల్లి మగిమ గాదేటి!'' అనుకుంటున్నారు ప్రజలు సంతోషంతో.

మూడు రోజుల్లో గ్రామంలో మూడు బోర్లు వేయడం, వాటి చుట్టూ విశాలమైన సిమ్మెంటు చపటాలు కట్టడం, వాడుకనీరు పోవడానికి సిమ్మెంటు కాలువలు వేయడం పనులన్నీ చకచకా జరిగిపోయేయి. మూడు బోర్లలోంచి స్వచ్ఛమైన త్రాగు నీరు పుష్కలంగా వస్తోంది. పనులన్నీ పూర్తవ్వగానే బోర్లు వేసిన ఇంజనీరు గ్రామ ప్రజలనందర్నీ సమావేశ పరిచేడు. గ్రామ ప్రజలందరికీ బోరువంపులను ఏవిధంగా ఉపయోగించాలో, ఏవిధంగా వాటిని ఉపయోగిస్తే అవి ఎక్కువ కాలం రిపేర్లు రాకుండా మన్నుతాయో, ఎలా వాడితే అవి త్వరగా చెడిపోతాయో ఆ వివరాలన్నీ అర్థమయ్యేటట్లు చెప్పేడు.

అదే సమయంలో ఊరుకి వెళ్లిన సత్యం తిరిగి వచ్చాడు. ఊర్లో వేసిన మూడు బోర్లూ చూసేడు. గ్రామ ప్రజల ముఖాల్లో సంతోషం చూసేడు. ముఖ్యంగా ఆడవారి ఆనందం గమనించేడు.

"సూసేరా సత్తెంబాబూ అమ్మతల్లి మగిమ!'' అన్నారు గ్రామ పెద్దలంతా సత్యంతో.

"అవును మరి అంతా అమ్మతల్లి సలవే! నాలుగు దినాల యెనకటి దినం రేతిరి నాను తిండి దిని తొంగున్నాను! అద్దరేతిరి ఏల అమ్మతల్లి కల్లోకొచ్చి నెగ్గొట్టింది!''

"నువ్వు సేస్తన్న పనేటొరే సత్తిగా! గేమంల పెజలంతా నావల్లే గదా! మరి గేమంల పెతీ ఇల్లూ నా ఇల్లుగాదేటి? నాకు ఏరే గుడి గట్టి అందల నన్ను బంధించి ఎడబాటు ఎట్టాలని సూస్తన్నావేటి? అట్టాటి సెడ్డ ఆలోసలు సేస్తే నాను వల్లకోనొరేయి! ఊర్ల పెజలు తాగునీటికి కటకట లాడతన్నారు. గుక్కెడు నీటి కోసం ఆడకూతుర్లు దూరాబారం ఎల్తన్నారు! ఆ ఇసయం ఎవురూ కానుకోనేదేటి? సూడోరేయి! నాకు గుడీ బందికానా ఏటీ ఒద్దు! నాను ఉన్న కాడే సుకం ఉన్నాను. నా గుడి కోసం పోగెట్టిన సొమ్ముతో ఊర్ల మూడు బోర్లు ఏపించు!'' అని అమ్మతల్లి ఆర్డరేసింది.''

"నాకు కరసెరనాలు ఆడనేదు. పెందిలయీ ఇసయం ఊర్ల పెద్దలకు సెప్పి ఎల్తాను! అన్నాను. నా సెంప పగలగొట్టింది. ఎంటనే బయలెల్లమని పట్నం తోలేసింది! ఊర్ల బోర్లు దిగే వొరకూ గేమంల కాలెట్టబోకు! అని అమ్మతల్లి ఆర్డరేసి తోలేసింది.''



"పట్నం ఎల్లి యీ బాబుని కలిసినాను. ఇసయం సెప్పినాను. 'బోర్ల సంగతేటో మాకు తెల్దు! ఆ పనంతా తవరే సూడాలన్నా. మూడుదినాల్లో మూడు బోర్లు ఏసి ఆటి పని నాను దగ్గరుండి సూస్తనని సెప్పి మాట నిలబెట్టుకున్నారు'' అన్నాడు సత్యం.

ఇంజనీరు మొత్తం పనికంతటికీ ఎంత అయిందో లెక్కకట్టి చెప్పేడు. సత్యం ఇంటికి వెళ్లి గుడి కోసం గ్రామ ప్రజలు ఇచ్చిన చందా డబ్బు తెచ్చి గ్రామ పెద్ద పోలినాయుడి చేతికిచ్చేడు. పోలినాయుడు సొమ్ము లెక్క పెట్టి ఇంజనీర్‌కి ఇచ్చాడు. అతను సొమ్ము తీసుకొని బిల్లు, రశీదు ఇచ్చి వెళ్లిపోయేడు.

పోలేరమ్మ గుడి ఆసరాతో గ్రామ ప్రజల త్రాగు నీటి సమస్య పరిష్కరించగలిగినందుకు మనసులోనే సంతోషించేడు సత్యం.